# అవిశ్వాసం

శ్రీనివాస్ దేవుణ్ణి నమ్మడు, అనుమానిస్తాడు- తనకు చెయ్యాల్సిన సాయం మరొకరికి చేస్తాడేమోనని. అందువల్ల ప్రతి రోజూ ఆఫీసుకు వెళ్ళేముందు దేవుడికి దణ్ణం పెట్టుకోవడం అలవాటు చేసుకున్నాడు. ఒకే దేవుణ్ణి నమ్ముకోవడం కూడా అంత మంచిది కాదని అతని అంతరాత్మ ఎన్నడో చెప్పింది. అందువల్ల దేవుడి గూట్లో నాలుగైదు పటాలు వెలిశాయి. అలవాటు ప్రకారం వాటికి నమస్కరిస్తుండగా వీధి మైక్‌లో ఒక ప్రకటన వినపడింది.

"మహా ప్రజలారా! మీకు తెలుసు, గోదావరి వరదలవల్ల ఎంత ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగిందో? వారి సహాయార్థం స్థానిక 'జనసేవా సంస్థ' తలపెట్టిన కార్యక్రమానికి మానవతా దృక్పథంతో చేయూత నిమ్మని కోరుతున్నాం."

శ్రీనివాస్‌కి కోపం వచ్చింది. తన పూజకు భంగం కలిగిందని కాదు. ప్రతి గాడిదకొడుకూ చందాల కోసం బయల్దేరేవాడే. వరదలూ, కరువులూ వీళ్ళకోసమే దాపరిస్తాయి కాబోలు' అనుకున్నాడు. ఎవరు వచ్చినా చందా ఇవ్వొద్దని భార్యకి చెప్పి ఆఫీసుకి బయలుదేరాడు. కాళ్ళు చెప్పుల్లో పెట్టేసరికి వీధి గుమ్మంలో రామ్మోహన్ ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు గుర్తు కొచ్చింది 'జనసేవా సంస్థ'కి రామ్మోహన్ సెక్రటరీ అని.

శ్రీనివాస్‌కీ, రామ్మోహన్‌కీ ఒకానొక విచిత్ర పరిస్థితిలో పరిచయం అయింది. రెండేళ్ళనాడు శ్రీనివాస్ చెప్పులు కొనుక్కోవడానికి షాపుకి వెళ్ళాడు. చెప్పులు కొని డబ్బు కోసం జేబులో చెయ్యి పెట్టేసరికి పర్సు చేతికి తగల్లేదు. సిటీబస్‌లో ఎవడో జేబు కొట్టేసినట్టు అర్థమైంది. శ్రీనివాస్ ఇబ్బంది పడుతుండగా పక్కనే ఉన్న రామ్మోహన్ బిల్లు చెల్లించాడు. శ్రీనివాస్ వారించినా ప్రయోజనం లేకపోయింది.

"ఫరవాలేదు లెండి. ఇబ్బందులు ఎవరికైనా తప్పవు" అన్నాడు రామ్మోహన్.

అతని అడ్రసు తీసుకుని ఇంటికి వచ్చాడు శ్రీనివాస్. మరుసటి రోజు వెళ్ళి అతని డబ్బు చెల్లించిందాకా నిద్ర పట్టలేదు. డబ్బు తిరిగి ఇవ్వడం ఆలస్యమైతే తనని

మోసగాడుగా ఎక్కడ జమకట్టేస్తాడో అని అతని భయం. అప్పటి నుంచీ తన సంస్థ కార్యక్రమాలన్నిటికీ శ్రీనివాస్‌ని పిలుస్తూ వచ్చాడు రామ్మోహన్. ఇద్దరి పరిచయం ఏకవచనంతో సంబోధించుకునేదాకా పెరిగింది.

"రావోయ్, రా!" అంటూ రామ్మోహన్‌ని లోపలికి ఆహ్వానించాడు శ్రీనివాస్.

"వస్తున్నా వస్తున్నా ఈ రోజు నిన్ను ఊరికే వదలను" అంటూ వచ్చి కుర్చీలో కూర్చున్నాడు రామ్మోహన్.

అతనితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా లోపలికి వచ్చారు. వాళ్ళని పరిచయం చేశాడు రామ్మోహన్. ఇంతలో శ్రీనివాస్ భార్య లోపలి గుమ్మంలో నిలబడింది.

"బాగున్నావమ్మా? పిల్ల లేరీ?" అని పలకరించాడు రామ్మోహన్. సమాధానం కోసం ఆగకుండా వచ్చిన పని వివరించాడు.

"బాగానే ఉంది. మంచి పని చేపట్టారు" అన్నాడు శ్రీనివాస్ నిర్లిప్తంగా.

"ఆ మాట చాలదు. ఈ మంచి పనికోసం మీ సహాయం కూడా అవసరం. మనిషికి మనిషి తోడు. కూడూ గుడ్డా లేని ప్రజలకి తోడ్పడటం కంటే పుణ్యం లేదు" అన్నాడు రామ్మోహన్.

"నిజమే. కాని ఎంతమందికని మనం సాయపడగలం?" అన్నాడు శ్రీనివాస్.

"ఉన్నంతలో మన వంతు కర్తవ్యం మనం నిర్వహిద్దాం. మనిషి శక్తి అపారం. ఇతరులకి సాయపడే కొద్దీ అది పెరుగుతుందే కాని తరగదు."

"ఇంతకీ నువ్వెంత చందా ఇచ్చావో చెబుదూ?"

"గురువుగారు రెండు నెలల జీతం ఇచ్చారండీ" అన్నాడు వెంట వచ్చిన వాళ్ళలో ఒక వ్యక్తి.

శ్రీనివాస్ ఇంకేమీ వాదించలేదు. రామ్మోహన్ కుటుంబం అతని జీతం మీదనే ఆధారపడి ఉందని అతనికి తెలుసు. చందా పుస్తకం తీసుకొని తోచిన అంకె వేశాడు. రామ్మోహన్ సంతోషంగా థాంక్స్ చెప్పాడు.

"మీరిచ్చిన డబ్బు ఏ రకంగానూ దుర్వినియోగం కాదు. మా సంస్థ సభ్యులం ఎల్లుండి బయలుదేరుతున్నాం. వరద బాధితులకి స్వయంగా మేమే సహాయం అందజేస్తాం" అని సెలవు తీసుకున్నాడు రామ్మోహన్.

"కాఫీ తాగి వెళ్దురుగాని ఉండండి" అంది శ్రీనివాస్ భార్య సావిత్రి.

"వద్దమ్మా, ఇప్పుడు సమయంలేదు. మళ్ళీ కలుస్తాను" అని చెప్పి రామ్మోహన్ తన స్నేహితుల్తో గడప దాటాడు.

"ఇచ్చిన చందా కాక కాఫీలు మరో దండగా?" అన్నాడు శ్రీనివాస్ భార్యని మందలిస్తూ.

"పోనీలెండి, ఏదో మంచి పనికోసం వచ్చారు. భగవంతుడు మన కింత ఇచ్చాడు.

కాఫీలు ఎంత చేస్తాయి? ఆ మనిషి చూడండి. తిరిగీ తిరిగీ ఎలా నల్లబడిపోయాడో?" అంది సావిత్రి.

"భగవంతు డిస్తే అందరికీ పందారం చెయ్యాలా ఏమిటి? ఈ డబ్బు అసలు వారికి చేరిందాకా నాకు నమ్మకం లేదు."

"పోదురూ, మీరు మరీ అనుమానస్థులు! ఆయన మంచితనం తెలిసి ఉండి కూడా అలా అంటారేం?"

"ఆయన మంచితనమేదో నా కంటే నీకే ఎక్కువ తెలిసినట్టుంది. ప్రపంచ మంతా మోసం తప్ప మరోటి లేదు" అని శ్రీనివాస్ ఆఫీసుకి బయల్దేరాడు. సావిత్రి మొహం చిన్నబుచ్చుకున్న సంగతి అతను గమనించలేదు.

సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి వచ్చేసరికి అతని బావమరిది రమణమూర్తి ఎదురు చూస్తూ కూర్చున్నాడు. రమణమూర్తికి శ్రీనివాస్ పద్ధతులు నచ్చవు. తన చెల్లెల్ని అతనికిచ్చిన కొద్ది కాలానికే శ్రీనివాస్ ఎదుటివాళ్ళని అనుమానిస్తూ మాట్లాడతాడనీ, గౌరవించడనీ రమణమూర్తి తెలుసుకున్నాడు. పెట్టిపోతల దగ్గర కూడా అభిప్రాయభేదాలు వచ్చాయి. ఇద్దరు చెల్లెళ్ళకీ పెళ్ళిళ్ళు చేసేసరికి రమణమూర్తి చితికిపోయాడు. వ్యవసాయంలో నష్టం వచ్చింది. ఆరెకరాల్లో మూడెకరాలు అమ్మేశాడు. మిగిలిన పొలానికి పెట్టుబడి చాలలేదు. ప్రస్తుతం అదే పనిమీద బావ దగ్గరికి వచ్చాడు. ఇష్టం లేకపోయినా రాక తప్పలేదు.

శ్రీనివాస్ ఆఫీసు నుంచి రాగానే రమణమూర్తిని చూసి "అంతా కులాసానా?" అని అడిగాడు. తరువాత నేరుగా వంటింటిలోకి వెళ్ళి భార్యతో "ఎందుకొచ్చాడు మీ అన్న?" అని ప్రశ్నించాడు.

"అదేమిటండీ? వచ్చిన మనిషిని రాగానే ఎందుకొచ్చావని అడుగుతామా?" అన్నది సావిత్రి.

"మర్యాదలన్నీ అయిపోయాయా?"

సావిత్రి మాట్లాడలేదు. నిజానికి అన్న వచ్చిన వెంటనే సావిత్రి ఊహించింది, డబ్బు సాయంకోసం వచ్చి ఉంటాడని. రమణమూర్తి మాసిన బట్టలు చూసి ఆమె మనసు చివుక్కుమంది.

శ్రీనివాస్ మొహం ముడుచుకొని రమణమూర్తి కెదురుగా కుర్చీలో కూర్చోగానే బయటి నుంచి కొడుకులిద్దరూ పరిగెత్తుకుంటూ వచ్చారు. రమణమూర్తి తను తెచ్చిన వేవో వాళ్ళకిచ్చాడు. శ్రీనివాస్‌కి చిరాకేసింది. తరువాత పిల్ల లిద్దరూ తండ్రి పక్కన చేరారు. వాళ్ళకెప్పుడో సైకిల్ కొనిపెడతానని అతను చెప్పాడు. ఆ మాట తనెప్పుడో మరిచిపోయినా పిల్లలు మరిచిపోలేదు. కొనిపెట్టమని మారాం మొదలు పెట్టారు. పిల్లలకి చనువిస్తే నెత్తికెక్కుతారనే అభిప్రాయం ఉంది. శ్రీనివాస్‌కి. అందుచేతనే వాళ్ళని సాధారణంగా

దగ్గరికి చేరనియ్యడు. పిల్లల మారాం శ్రుతిమించేసరికి శ్రీనివాస్‌కి కోపం ఎక్కువయింది. ఇద్దరికీ రెండిచ్చుకున్నాడు. వాళ్ళు ఏడుపు లంకించుకున్నారు.

"ఏమిటి బావా, నువ్వు మరీను? ఏదో పిల్లలు పోనిద్దూ" అన్నాడు రమణమూర్తి వాళ్ళని దగ్గరకు తీసుకొంటూ.

పిల్లలమీద కోపం కంటే వాళ్ళని బావమరిది మచ్చిక చేసుకుంటున్నాడనే కోపం ఎక్కువయింది శ్రీనివాస్‌కి. ఆ పళాన కొడుకులిద్దర్నీ లాగి మళ్ళీ రెండు దెబ్బలు వేశాడు, నోరు ముయ్యమని. వాళ్ళు నోరు ముయ్యకుండానే ఇంట్లోకి వెళ్ళారు.

స్నానపానాదులయ్యేంతవరకూ బావా, మరుదుల మధ్య సంభాషణ ముక్తసరిగా సాగింది. భోజనానంతరం హల్లో కూర్చుండగా రమణమూర్తి మెల్లగా వచ్చిన పని కదిపాడు. వ్యవసాయం ఖర్చుల కోసం వెయ్యి రూపాయలడిగాడు.

"అనుకున్నాను అదే పనిమీద వచ్చావని" అన్నాడు శ్రీనివాస్ గంభీరంగా.

"తప్పలేదు బావా! నీ దగ్గరికి తప్ప ఇంకెవరి దగ్గరకు వెళతాను?" అన్నాడు రమణమూర్తి.

"నా దగ్గరేమైనా ముల్లె మూలుగుతూందనా నీ అనుమానం? చూస్తున్నావుగా, పిల్లలకి సైకిల్ కొనిపెట్టడానికే ఇదవుతున్నాను."

"తలుచుకుంటే వెయ్యి రూపాయలు మీరు సర్దలేరండీ? ఇబ్బందుల్లో కాకపోతే మరెప్పుడు అక్కరకొస్తాయి బంధుత్వాలు? ఎక్కడో ఒక చోట చూడండి మరి" అంది సావిత్రి.

డబ్బు వ్యవహారాల్లో భర్త తననెప్పుడూ సంప్రదించకపోయినా బ్యాంకులో కనీసం అయిదారు వేలైనా నిల్వ ఉండాలని సావిత్రి అంచనా. శ్రీనివాస్ భార్య వంక చురుగ్గా చూశాడు.

"దాచిపెట్టుకుని లేదనే తత్వం కాదు నాది. ఇప్పటికిప్పుడు వెయ్యి రూపాయలు పుట్టించడం నావల్ల కాదు" అన్నాడు పైకి లేస్తూ. ఇక సంభాషణ కొనసాగించనవసరంలేదని అతని ఉద్దేశం.

మళ్ళీ అగడటానికి రమణమూర్తికి మనస్కరించలేదు. డబ్బు లేదనడం కంటే లేదని చెప్పే విధానం అతన్ని ఎక్కువ బాధించింది. మెల్లగా లేచి తనకు వేసిన పక్కమీద పడుకున్నాడు. అతను పడుకున్న తరువాత భార్యా భర్తల మధ్య సంభాషణ కొనసాగింది.

డబ్బు ఉంచుకుని కూడా లేదని, వట్టి చేతులు చూపించడం అన్యాయమంది సావిత్రి. డబ్బు లేదనడం అబద్ధమేనని శ్రీనివాస్‌కి తెలుసు. బ్యాంకులో అయిదు వేలకి పైగానే ఉన్నాయి. వాటితో ప్రస్తుతం ఏ అవసరమూలేదు. కాని తనది అబద్ధ మని భార్య తేల్చి చెప్పినందుకు శ్రీనివాస్ సహించలేకపోయాడు. అతనేదైనా సహించ గలడేమో గానీ తనని ఇతరులు అనుమానించడం సహించలేడు. మాటకు మాట పెరిగింది.

ఊరుకోలేకపోయింది సావిత్రి. అన్న తననెంత గారాబంగా పెంచాడో, తల తాకట్టుపెట్టి ఎలా తలకి మించిన సంబంధం తెచ్చాడో, పెట్టిపోతల కోసం ఎంత ఖర్చు చేశాడో సావిత్రికి గుర్తు కొచ్చాయి. శ్రీనివాస్ కవేవీ గుర్తు రాలేదు. ఒకానొక స్నేహితుడు తన దగ్గర అయిదొందలు అప్పు తీసుకుని ఎలా ఎగ్గొట్టాడో మాత్రమే గుర్తుంది.

కొద్ది కాలం నుంచీ బ్యాంక్ బ్యాలెన్స్ పెరిగే కొద్దీ ఒక రకమైన మనస్తత్వం శ్రీనివాస్‌లో బలపడసాగింది. తన కళ్ళముందు డబ్బు కోసం వెంపరలాడే వాళ్ళంతా నీతిలేని మనుషుల్లాగా కనిపించసాగారు. అవసరమైతే డబ్బు కోసం మోసం చెయ్యటానికి వాళ్ళు వెనకాడరనిపించింది. అందుచేత వాళ్ళని నమ్మనవసరంలేదనీ, సాయపడ నవసరంలేదనీ శ్రీనివాస్ నిర్ణయం.

"నా దగ్గర డబ్బుందంటే ఉందనుకో, లేదనుకుంటే లేదనుకో. ఉన్నా లేకపోయినా తాహతులేని వాళ్ళకి అప్పివ్వడం నాకిష్టంలేదు." అన్నాడు శ్రీనివాస్ కుండపగలేసి.

"మీలో మానవత్వంలేదు" అంది సావిత్రి దురుసుగా.

ఆ మాటతో శ్రీనివాస్ కోపం నసాళాని కంటింది.

"అంటే నేను మనిషిని కాదూ నీ కళ్ళకి?" అంటూ కూర్చున్నవాడల్లా ఒక్క ఉదుటున లేచి సావిత్రి చెంప పగలగొట్టాడు.

"ఈ పనే చెబుతుంది మీ రెలాంటి వాళ్ళో" అంటూ సావిత్రి కన్నీళ్ళొత్తుకుంటూ రోషంతో లేచి వెళ్ళింది.

శ్రీనివాస్ కోపం తగ్గలేదు. పైచెయ్యి తనదే అయినా పై మాట వెళ్ళానిదే అయినందుకు ఉక్రోషం పట్టలేకపోయాడు. కాని ఏం చేయాలో తోచలేదు. పక్కమీద పడుకుని అటూ ఇటూ పొర్లాడు ఏదేదో ఆలోచిస్తూ. ఆ ముగ్గురిలో ఆ రాత్రి నిద్ర సరిగా పట్టంది శ్రీనివాస్‌కే.

ఉదయాన్నే రమణమూర్తి శ్రీనివాస్‌కి చెప్పి ఊరికి ప్రయాణమయ్యాడు. సావిత్రి కన్నీళ్ళు పెట్టుకుంది, అన్నని సాగనంపుతూ, శ్రీనివాస్ మౌనంగా ఉండి పోయాడు. తరువాత ఒంటరిగా కూర్చుని తన ఆస్తిపాస్తులన్నీ బేరీజు వేశాడు. సావిత్రికి పుట్టింటి వాళ్ళిచ్చిన సొమ్మే గాక మరి కొంత డబ్బూ, ఇల్లూ వగైరా భార్య పేరనే ఉంచాడు శ్రీనివాస్. ఆలోచించగా అదంత మంచి పని కాదని తోచిందతనికి ఎవర్నీ నమ్మదలుచుకోలేదతను. తన మాట కాదని సావిత్రి ఎప్పుడైనా ఆమె పేర నున్న సొమ్ము దుర్వినియోగం చెయ్యవచ్చని గట్టిగా నమ్మాడు. అన్నకు సాయం చేసే విషయంలో తన మాట మీరి పోయేట్టు కనిపించింది. నిన్న తన మాటనంత నిర్లక్ష్యంగా వ్యతిరేకించింది. రేపేం చేస్తుందో ఎవరికి తెలుసు? అందుచేత తన జాగ్రత్తలో తనుండటం మంచిదనుకున్నాడు శ్రీనివాస్. సావిత్రి అకౌంటులో ఉన్న డబ్బంతా విత్‌డ్రా చెయ్యడానికి సంతకాలు తీసుకున్నాడు. అదేమిటని ప్రశ్నించలేదు సావిత్రి. నిజానికి ఆమెకిటీవల భర్త ప్రవర్తన కంటగింపుగానే

ఉంది. ప్రతి పైసా ఖర్చు చెయ్యడానికీ అతని పర్మిషన్ కావాలి. తనకి తెలియకుండా ఎవరి ఇళ్ళకీ వెళ్ళడానికి వీల్లేదు. తను చేసే ప్రతి పనిమీదా ఎంతో అధికారం ఉన్న వాడిలా ప్రవర్తించడమే గాక, భర్త రహస్యంగా తన శీలాన్ని కూడా శంకిస్తున్నట్టు రూఢి చేసుకుంది సావిత్రి. వీధిలో ఎవడైనా పదే పదే తన అందాన్ని చూడడం తన తప్పే అయినట్టూ, బస్సులో ఎవడైనా తనని రాసుకోవటంలోనూ తన పాత్ర ఉన్నట్టు భర్త అనుమానించడం ఆమె కెంతో అసహ్యమనిపించింది. ఇంట్లో తను కేవలం పిల్లల్ని కని పెంచే యంత్రమేనన్న సంగతి గ్రహించి నప్పట్నుంచీ సావిత్రి భర్తను ద్వేషించసాగింది.

శ్రీనివాస్ బజారు వెళ్ళి సావిత్రి అకౌంట్ లోంచి డబ్బు తీసుకుని వస్తుండగా రామ్మోహన్ కనిపించాడు. అతనేదో హడావుడిగా వెళ్తుండగా శ్రీనివాస్ పలకరించాడు.

"ఏమోయ్! చందా తీసుకున్న తరువాత మళ్ళీ కన్పించలేదు?"

"నిన్ననే రాజమండ్రి నుంచి వచ్చాం. చందా డబ్బంతా పంపిణీ అయిపోయింది. మొత్తం ముప్పై వేలు వసూలైంది" అన్నాడు రామ్మోహన్.

"ఏమాత్రం మిగిలిం దేమిటి?" అడిగాడు శ్రీనివాస్ యదాలాపంగా అడిగినట్టు.

రామ్మోహన్‌కి అతని ప్రశ్న అర్థం కాలేదు.

"మిగలటం ఏమిటి?" అన్నాడు.

"ఏం లేదులే" అని ఊరుకున్నాడు శ్రీనివాస్.

రామ్మోహన్ తమకి వసూలైన డబ్బులో బట్టలకీ, ఆహారం పొట్లాలకీ ఎంతెంత ఖర్చయిందీ, వాటిని ఏ విధంగా పంపిణీ చేసిందీ వివరాలన్నీ చెప్పాడు. శ్రీనివాస్‌కి ఆ వివరాలమీద ఆసక్తిలేదు. 'ముప్పై వేలలో కనీసం నాలుగైదు వేలన్నా మిగల్చకుండా ఉంటాడా' అనుకున్నాడు.

"మళ్ళీ త్వరలో ఒకసారి మీ ఇంటికి వస్తాలే" అన్నాడు రామ్మోహన్ మధ్యలో.

"ఏమిటీ? మళ్ళీ చందాకేనా?"

"మరేం భయపడకు, వేరే పనిమీద."

రామ్మోహన్ శ్రీనివాస్‌తో మాట్లాడి వెళుతూ ఆలోచించగా అప్పుడర్థమయింది, అతని ప్రశ్నలోని అంతరార్థం, 'ఎంత తక్కువగా అంచనా వేశాడు తనని?' అనుకున్నాడు. అతని దగ్గరికి చందాకి వెళ్ళడం తప్పేమో అనిపించింది. కాసేపు బాధపడ్డాడు. చివరికి శ్రీనివాస్ తనని అనుమానించినా వరద బాధితులకోసం తను చేసిన కృషి పట్ల సంతృప్తి చెందాడు రామ్మోహన్.

కొంతకాలం నుంచి అతనిలో ఒక ఆలోచన సుడి తిరుగుతోంది. పట్నంలో ఒక మూల కొంత స్థలం ఉంది తనకి. అందులో అనాథాశ్రమం ఏర్పాటు చెయ్యాలని అతని ఉద్దేశం. ఒకరిద్దరు ధవంతులైన మిత్రుల సహాయం కూడా అడిగి ఉంచాడు. కానీ ఆ విషయం భార్యని సంప్రదించకుండా నిర్ణయం తీసుకోవడం మంచిది కాదనుకున్నాడు. ఆ

రోజు భార్యతో ఆ విషయం ప్రస్తావించాడు. ఏ విషయంలోనైనా భర్త తన అభిప్రాయం అడగటం, తన సమ్మతి లేకుండా ఏ కార్యక్రమం తలపెట్టకపోవడం మాధవి కెప్పుడూ సంతోషం కలిగించే అంశం. అయితే ఈ విషయంలో ఆమె ఒక పట్టాన అంగీకరించలేదు.

అదేం సామాన్యమైన పననుకున్నారా? ఎన్ని ఇబ్బందు లుంటాయో? ఇప్పటికి చేస్తున్నది చాల్లెండి. ఉన్న ఒక్క స్థలమూ ఆశ్రమాల కిచ్చేస్తే పిల్లల గతేంగాను? ఈ అద్దె కొంపల్లోనే జీవితాంతం గడపాలనా మీ ఉద్దేశం?" అని సూటిగా అగిడింది.

భార్యలో ఈ సూటిదనాన్నే రామ్మోహన్ గౌరవిస్తాడు. మాధవిని పూర్తిగా నమ్మటానికి ఈ అంశమే అతనికి ఉపకరించింది. ఆమె తెలివితేటల మీద కూడా అతని కెలాంటి సందేహమూ లేదు. అలాగే తనకు మాలిన నీతిలోనూ అతనికి విశ్వాసం లేదు. ఉన్నదంతా దేశానికి ఊడ్చిపెట్టి జోగులైన వాళ్ళను అతనెరుగును. తనూ అలా కావటం అతని కిష్టంలేదు. ఈ లోకంలో సాటి మనిషికి సాయపడాలంటే సర్వస్వం కోల్పోవాలనే సూత్రం అతనికి గిట్టదు.

"పోనీ ఒక పని చేద్దాం. తాత్కాలికంగా మన స్థలంలో ఆశ్రమాన్ని నడపనిద్దాం. ఎవరైనా ఉదారులు దొరికినప్పుడు ఆశ్రమం వేరే ప్రదేశంలోకి మార్చవచ్చు. ప్రస్తుతానికి ఒక రిద్దరు మిత్రులు ఈ పనిలో చెయ్యివేద్దా మనుకున్నారు" అన్నాడు రామ్మోహన్.

"ఇందులో సాధకబాధకాలు జాగ్రత్తగా ఆలోచించండి. మొదలుపెట్టి విఫలమయ్యేకంటే అసలు పూనుకోకపోవడమే మంచిది కాదా?" అన్నది మాధవి.

"నిజమే. అయినా నీ అంత అనుకూలవతి భార్యగా దొరికిం తరువాత ఇంకా అపజయమేముంటుంది నాకు?" అన్నాడు రామ్మోహన్ నవ్వుతూ.

"పొగడ్తలు చాల్లెండి" అంది మాధవి. ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి. ఇంతలో పిల్లలు రాగా వాళ్ళతో కబుర్లలో పడ్డాడు రామ్మోహన్.

రామ్మోహన్ కలిగిన కుటుంబం నుంచి వచ్చినవాడే. అతని తండ్రి రిజిస్ట్రారుగా పని చేసి అడ్డమైన లంచాలు పట్టాడు. కొన్ని కేసులు నడచినా వేటిల్లోనూ అతను దొరకలేదు. ఎంత సంపాదించినా ఇంట్లో మాత్రం భార్యతో సరిపడేది కాదు. ఆమె రామ్మోహన్‌ని తండ్రి నీడ పడకుండానే పెంచింది. ఆయన కూడా కొడుకునేనాడూ ఎత్తుకుని ముద్దు చెయ్యలేదు. వాడికోసం చాలినంత సంపాదించి పెట్టడమే తండ్రిగా తను నిర్వర్తించాల్సిన ఏకైక కర్తవ్యంగా కన్పించింది. రామ్మోహన్ కాలేజీ చదువు కొచ్చేటప్పటికి తండ్రి మరణించాడు. తండ్రి మరణంతో రామ్మోహన్‌కి తన అభిప్రాయాలకీ, స్వేచ్ఛకీ ఉన్న అడ్డంకేదో తొలగిపోయి నట్టనిపించింది. చదువు పూర్తయి ఉద్యోగంలో చేరే ముందు రెండేళ్ళ పాటు దేశం తిరిగాడు. దేశంగాని దేశంలో తను ఇబ్బందులకి గురైనప్పుడు తోటి మనుషులు సంతోషంగా సహాయపడటం గమనించాడు. ద్వేషం, మోసం, మనిషి సహజ స్వభావాలు కావనీ ఇతర ప్రాణుల్లో కనిపించే సామూహిక తత్వాన్ని

మనిషి కాపాడుకోవాలనీ గుర్తించాడు. అప్పట్నుంచీ అతను ఒంటరివాడు కాడు. ఎంతో మంది స్నేహితుల్ని సంపాదించాడు. కలివిడితనం అతని స్వభావం అయింది. సమాజంలోని కొంత మందికైనా ఉపయోగపడే స్తోమత తన కున్నదని అతను గ్రహించాడు. తత్ఫలితమే 'జనసేవా సంస్థ.' ఈనాడా సంస్థకి సమాజంలో గౌరవం లభించిందంటే దానికి రామ్మోహన్ కృషే కారణం. ఆ సంస్థ ఉనికి కోసం అహోరాత్రులు కష్టపడ్డాడు. దాని వెనక కనిపించని చోదకశక్తి మాధవి.

రామ్మోహన్ అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నాడన్న సంగతి విని శ్రీనివాస్ నివ్వెరపోయాడు. అతను ఆఫీసు పనిలో ఉండగా రామ్మోహన్ వచ్చి ఆహ్వానం ఇచ్చి తప్పనిసరిగా రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. అతని సొంత స్థలంలోనే అనాథాశ్రమం కొనసాగుతుందని విని శ్రీనివాస్ మరింత ఆశ్చర్యపోయాడు. 'ఇందులో ఏదో తిరకాసు ఉండే ఉంటుంది' అనుకున్నాడు. ఆఫీసులో ఇతర వ్యక్తులకీ తెలిసింది విషయం. కొంతమంది మెచ్చుకున్నప్పుడు శ్రీనివాస్ అందుకున్నాడు.

"అనాథాశ్రమం అంటే అషామాషీనా ఏమిటి? దాని కెంత పట్టుదల ఉండాలి? పేదవాళ్ళ మీద ప్రేమాభిమానాలకేం ఎంతైనా కురిపించొచ్చు. కాని ఇందుకు విపరీతంగా డబ్బు కావద్దూ? అదెక్కణ్ణుంచి వస్తుంది?" అన్నాడు.

"దాని కేవో ఏర్పాట్లు లేకుండా ఉంటాయా?" అన్నాడొకాయన.

"ఇదేదో తాత్కాలికమైన కార్యక్రమం కాదండీ. ఎంత తతంగం, ఎంత ఇదీ కావాలో? ఇల్లు అలగ్గానే పండగ్గెందీ?" అన్నాడు మళ్ళీ శ్రీనివాస్. తని మాటలన్నీ విన్న వాళ్ళకి అతను దేన్ని తప్పు పడుతున్నాడో అర్థం కాలేదు. మొత్తంమీద ఈ రోజుల్లో అనాథాశ్రమ నిర్వహణ ప్రతి పుల్లయ్యకీ సాధ్యం కాదని ఆఫీసులో అందరిచేతా ఒప్పించగలిగాడు శ్రీనివాస్.

అనాథాశ్రమానికి రామ్మోహన్ 'నిర్మల సదనం' అని పేరు పెట్టాడు. ప్రారంభోత్సవానికి పెద్ద ఆర్భాట మేమీ చెయ్యలేదు. ఆశ్రమానికి సాయం చేసిన వాళ్ళనీ, ఇంకా తనకు తెలిసిన వాళ్ళనీ మాత్రం పిలిచాడు. మంత్రుల్నీ అధికారుల్నీ పిలవనందుకు కొంతమంది రామ్మోహన్‌ని తప్పుపట్టారు. వాళ్ళ విమర్శలకి రామ్మోహన్ చిరునవ్వే సమధానంగా ఊరుకున్నాడు. దాదాపు పిలిచిన వాళ్ళంతా కుటుంబ సమేతంగా వచ్చినవాళ్ళే. ఏ కళ నున్నాడో శ్రీనివాస్ కూడా భార్యతో సహా వచ్చాడు. స్త్రీలనందర్నీ మాధవి రిసీవ్ చేసుకొంది.

నిర్మల సదనం కొద్దిదే అయినా తీర్చిదిద్దినట్టు ఏర్పాటు చెయ్యబడింది. అనాథలుండటానికి నాలుగు పూరిపాకలున్నాయి. మరో రెండు పాకల్లో కుట్లు, అల్లికలు వగైరా పనులకు సంబంధించిన పనిముట్లున్నాయి. వంటకీ, స్నానపానాదులకీ వేరే ఏర్పాట్లున్నాయి. ఒక మూలగా బావి. మిగిలిన కొద్ది ఖాళీ స్థలంలో పూలమొక్కలు వేశారు.

ఈ ఏర్పాట్లలో నెల రోజుల నుంచి రామ్మోహన్‌కీ మాధవికీ ఊపిరి సలపలేదు.

ప్రారంభ సభకి ఆశ్రమం కోసం విరాళ మిచ్చిన పెద్దమనిషి ముఖ్య అతిథిగా వచ్చాడు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి రామ్మోహన్‌ని కాసేపు పొగిడాడు. అంతకుముందే ఒక ప్రఖ్యాత సంఘ సంస్కర్త ఆశ్రమాన్ని లాంఛనంగా ప్రారంభం చేశాడు. ఆయన కూడా ప్రసంగించిన తరువాత రామ్మోహన్ లేచి తన ఆశయాన్ని వెల్లడించాడు.

"ప్రపంచం నిండా ద్వేషం ఉంది. సమాజం నిండా అసమానత్వం ఉంది. పతితుల్నీ దరిద్రుల్నీ తయారుచేస్తున్న సామాజిక వ్యవస్థ మరేదైనా కావచ్చుగానీ మానవ వ్యవస్థ కావడానికి వీల్లేదు. వ్యక్తి మాత్రుడిగా దీన్ని మార్చగల తాహతు నాకు లేదు. కనీసం కొందరి సాయంతోనైనా మనుషుల్ని మనుషులుగా నిలబెట్టడానికి పూనుకోవా లనిపించింది. ఆ పూనికే నిర్మల సదనం. హృదయమున్న మీలాంటి వాళ్ళ తోడ్పాటే దీనికి బలాన్నీ భవిష్యత్తునూ కల్పిస్తుంది" అంటూ క్లుప్తంగా మాట్లాడి వేదిక దిగాడు. చాలామందికి అతని మాటల్లోని సరళత్వం, నిజాయితీ నచ్చాయి. ఇంకా మాట్లాడితే బాగుండుననిపించింది. మాధవి మనస్సులోనే సంతోషించింది.

పక్కనే ఉన్న సావిత్రి "మీవారు మంచి వక్త కూడా సుమా?" అంది. మాధవి నవ్వి ఊరుకుంది.

సభ ముగిసిన తరువాత అతిథులు చాలామంది కబుర్లలో పడ్డారు. నిర్మల సదనం ఏర్పాటులో రామ్మోహన్ కుడి భుజం శ్రీధర్ మరికొంతమంది మిత్రులు అందులో పాలుపంచుకున్నారు. దూరంగా ఆడవాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

"రామ్మోహన్‌లాంటి స్వార్థత్యాగులు కొంతమంది బయలుదేరితే గాని సమాజం బాగుపడదు" అన్నాడొకాయన మాటల మధ్య.

"స్వార్థత్యాగంలో నాకు నమ్మకం లేదు" అందుకున్నాడు శ్రీనివాస్. "స్వార్థం లేని మనిషంటూ ఉండడు. ఎంత మంచి పని చేసినా ఏదో ఒక స్వార్థం- కీర్తి గాని, పుణ్యం గానీ- ఏదో ఒకటి తప్పనిసరిగా ఉంటుంది."

"నా మట్టుకి నాకు రామ్మోహన్ తలపెట్టిన పనిలో ఏ స్వార్థం కనిపించడంలేదు". అన్నాడాయన.

"మనం చూసే దృష్టిని బట్టి కూడా కొంత ఉంటుంది" అన్నాడు శ్రీనివాస్. అతని అభిప్రాయాన్ని శ్రీధర్ గౌరవించలేదు.

"మనం స్వీయ ప్రమాణవాదులం. మన అనుభవాలకీ, ఆలోచనా పరిమితులకీ మించిన వాటిని ససేమిరా నమ్మం. మనకు మనమే రుజువూ, సాక్ష్యమూ, అయితే ఈ ధోరణితో జీవితంలో ఎక్కువ దూరం వెళ్ళలేం" అన్నాడు చురుగ్గా.

శ్రీనివాస్‌కి వేడందుకుంది. ఈ ప్రపంచంలో నీతీ నిజాయితీ గలవాడు లేడు పొమ్మన్నాడు. దేశాలన్నీ అలాగే తగలబడ్డాయనీ గోర్బచేవ్ దగ్గర నుంచి రీగన్ దాకా

దులిపేశాడు. హ్యూమనిజం నుంచి కమ్యూనిజం దాకా ఏ సిద్ధాంతమూ మనిషినుద్ధరించలేదని మిమర్శించాడు. చివరికి "ప్రపంచ మంతా మోసం తప్ప మరోటి లేదు" అని తేల్చేశాడు.

అతని మాటల మధ్యలో అక్కడికి వచ్చిన రామ్మోహన్ అందుకున్నాడు. "అందుకు కారణం ఏమిటంటావు?"

"ఏమో?" అనేశాడు శ్రీనివాస్ దూకుడుగా. సంబంధాలు తప్ప ఆత్మీయ సంబంధాలుండవు. మన బతుకుల్లోనూ వ్యాపార లక్షణం ప్రవేశించింది. లాభాల వేట ప్రారంభమయింది. ఇక మానసిక అనుభూతులకీ, మానవతా విలువలకీ తావెక్కడ? శ్రామికుడి నుంచి యజమానే కాక, చివరికి భార్య నుంచి భర్త కూడా లాభాన్నే కోరుతున్నాడు. ప్రమాదకరమైన స్వార్థ ధోరణి ఇది" అన్నాడు నిదానంగా రామ్మోహన్.

"పోనీలే. భార్యా భర్తల మధ్య కూడా స్వార్థం తలెత్తినప్పుడు నువ్వూ, నీ ఆశ్రమం ఎలాగూ ఉన్నాయి గదా?" అన్నాడు శ్రీనివాస్ హాస్యంగా. వాతావరణం ప్రసన్నంగా మారింది.

ఇంతలో రామ్మోహన్ ఎవరికో వీడ్కోలు చెప్పటానికి గేటు దాకా వెళ్ళాడు. తిరిగి లోనికి వస్తుండగా సావిత్రి తారసపడింది.

"చాలా మంచిపని తలపెట్టారు మీరు" అంది.

"ఇందుకు మీలాంటి వాళ్ళ ప్రోత్సాహం కూడా అవసరం. వీలున్నప్పుడు వచ్చి ఇక్కడి స్త్రీలకేమైనా నేర్పి పోతుండండి."

"అంత అవకాశం నా కెక్కడిది? ఎప్పటికైనా అనాథగా చేరి పని పాటలు చేసిపెడతాలెండి. నాకూ కాస్త చోటు అట్టిపెట్టండి."

ఆ మాటలకు రామ్మోహన్ ఆశ్చర్యపోయాడు. "మీకా అవసరం రాకూడదనే అనుకుంటున్నాను" అన్నాడు ముక్తసరిగా.

అనేసరికి శ్రీనివాస్ వచ్చి భార్యతో పాటు రామ్మోహన్ నుంచి సెలవు తీసుకున్నాడు.

సావిత్రి ఎందుకో లోలోపల బాధపడుతున్నదని రామ్మోహన్ గమనించాడు. కానీ కారణమేమిటో ఎంత ఆలోచించినా అంతుబట్టలేదు.

శ్రీనివాస్ ఇంటికి వెళ్ళగానే సావిత్రిని అడిగాడు రామ్మోహన్‌తో ఏం మాట్లాడావని. సావిత్రికి విసుగేసి సమాధానం చెప్పలేదు. శ్రీనివాస్ రుసరుసలాడాడు. సావిత్రి లెక్కచెయ్యలేదు. రోజులు గడిచే కొద్దీ వారిద్దరి మధ్య అగాధం పెరిగి పెద్దదైంది. ఒకసారి సావిత్రి పట్టుపట్టి పుట్టింటికి వెళ్ళి వచ్చింది. అక్కడ అన్న సంసారం చూస్తే గుండె చెరువైంది.

రమణమూర్తి పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. తెగుళ్ళు తగిలి పంటలో నష్టం వచ్చింది. తెచ్చిన అప్పు వడ్డీతో తడిసి మోపెడైంది. ఇల్లో, పొలమో తెగనమ్మితే తప్ప బయటపడే దారిలేదు. అన్న వేసుకున్న చిరిగిన బట్టలూ, వదిన బోసిమెడా, దరిద్రం

ఒడుతున్న ఇల్లూ చూస్తున్న కొద్దీ సావిత్రి మనసు వికలమైంది. అన్నీ ఉన్నా అన్నయ్యకు సాయపడలేనందుకు తనను తనే నిందించుకుంది. భర్తను మనస్ఫూర్తిగా ద్వేషించింది.

శ్రీనివాస్ - భార్య తనని ద్వేషిస్తుందా, ప్రేమిస్తుందా అనే అంశాన్నెప్పుడూ పట్టించుకోలేదు. భార్యలో అతను విధేయతను తప్ప మరి దేన్నీ కోరుకోలేదు. భర్తగా పోషిస్తున్నవాడు తను గనక భార్యకి తన పట్ల విశ్వాసం ఉండాలని గట్టిగా నమ్మాడు. కాని ఇటీవల సావిత్రి తన బాధ్యత సరిగా నిర్వహిస్తుందనే నమ్మకం పోయింది అతనికి. ఆమె ప్రవర్తననీ, శీలాన్నీ శంకించాల్సిన అవసరం కనబడింది. కాబట్టి మరింత కట్టుదిట్టాలు చేశాడు. దాంతో సావిత్రిలో తిరుగుబాటు తత్వం బలపడింది.

ఆరు నెలలు గడిచాయి. నిర్మల సదనం ఒక దారికి వచ్చింది. దాదాపు ఇరవై మంది అనాథ స్త్రీలు అందులో ఉన్నారు. ఏ ఆధారం లేని వితంతువులు, భర్తల చేత వెళ్ళగొట్టబడిన వాళ్ళు, అందులో ఉన్నారు. వాళ్ళు దిగులు పోగొట్టి తమ కాళ్ళమీద తాము నిలబడేలా చెయ్యాల్సిన బాధ్యత రామ్మోహన్‌ది. తోడుగా శ్రీధర్. కొంతమంది చిన్న చిన్న అలంకరణ సామగ్రి తయారుచేసే వాళ్ళు. దీనివల్ల ఆశ్రమానికి స్వయం పోషకత్వం అలవడింది. తరుచుగా రామ్మోహన్ తనకు తెలిసిన వాళ్ళనీ, తెలియని వాళ్ళనీ తీసుకొచ్చి ఆశ్రమం చూపించి వివరాలు తెలియజేస్తుండేవాడు. వాళ్ళలో ఎవరైనా ఎప్పుడైనా సహాయం చేస్తారని ఆశ. నిర్మల వదనానికి ఎప్పటికైనా విశాలమైన స్థలంలో పెద్ద భవనంతో శాశ్వత వసతి కల్పించాలని అతని ఆశయం.

నిర్మల సదనం నిర్వహణలో రామ్మోహన్ ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొన్నాడు. గర్భవతులై ఆశ్రమానికి వచ్చిన వాళ్ళని ఏం చేయాలో మొదట అర్థం కాలేదు. ఆ విషయంలో ఒకరిద్దరు డాక్టర్లు అతనికి సాయపడ్డారు. ఒక్కోసారి ఆశ్రమంలో ఉన్న వాళ్ళని తమతో పంపించమని వాళ్ళ తాలూకు వ్యక్తులు వచ్చి పట్టుబట్టే వాళ్ళు. ఆ స్త్రీలు వెళ్ళడాని కిష్టపడనప్పుడు రామ్మోహన్ పరిస్థితి ఇరకాటంలో పడేది. రామ్మోహన్ మీద నీచమైన నిందలు మోపినవాళ్ళూ ఉన్నారు. రామ్మోహన్ కన్నా శ్రీధర్ బాగా లౌక్యం తెలిసినవాడు. అలాంటి రెండు, మూడు పరిస్థితుల్లో అతను సునాయసంగా ఆ సమస్యల్ని పరిష్కరించాడు. ఏ పరిస్థితిలోనైనా మనోధైర్యం కోల్పోకుండా మాధవి తోచిన సలహాలు చెప్పేది.

దాదాపు ప్రతి రోజూ రామ్మోహన్ ఆఫీసు నుంచి నేరుగా నిర్మల సదనానికి వెళ్ళేవాడు. ఒక రోజు అతను నిర్మల సదనం నుంచి ఆలస్యంగా ఇల్లు చేరేసరికి ఇంట్లో సావిత్రి కనిపించింది. ఆమె ఒక్కతే తమ ఇంటికి రావడం అదే మొదటిసారి. మాధవి ద్వారా, శ్రీనివాస్ భార్యని అనుమానించి ఘర్షణ పడినట్టు విని నివ్వెరపోయాడు రామ్మోహన్. వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఇదెలా జరిగింది?" అన్నాడు చివరికి.

"ఏముందీ? నే నెవరితో మాట్లాడినా ఆయనకి అనుమానమే. పెళ్ళైనప్పట్నుంచీ తనని మోసగించటానికే నేను ప్రయత్నిస్తున్నానట. ఎప్పట్నుంచో అనుకుంటున్నాను, ఎప్పటికైనా నాకీ పరిస్థితి తప్పదని. ఈ రోజుతో నా పాపం పండింది. పక్కింటావిడ బయటికి వెళ్తూ తాళంచెవి నా కిచ్చింది. తాళం చెవికోసం వాళ్ళాయన మా ఇంటి కొచ్చాడు. అదీ నేను చేసిన తప్పు" అంది సావిత్రి. కంఠస్వరం మామూలుగా ఉన్నా లోలోపల ఎంతో బాధపడుతున్నట్టనిపించింది రామ్మోహన్‌కి.

"అయినా ఆయన కిదేం బుద్ధి? ఇన్నాళ్ళూ కాపరం చేసి ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత భార్యననుమానించడం ఏమిటి?" అంది మాధవి కలగజేసుకొని.

"పోనీ నేను శ్రీనివాస్‌తో మాట్లాడనా?" అడిగాడు రామ్మోహన్.

"ఫలితం ఉండదు. ఒక అభిప్రాయానికి వచ్చిన తరువాత ఆయన ఎవరి మాటా వినరు. తనకి తనే ప్రమాణం.ఎన్నడోమీ ఆశ్రమంలో నాకూ చోటుంచమని నచెప్పాను గదా! ఇప్పుడాఅవసరం వచ్చింది" అంది సావిత్రి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.

"అదేమిటీ? మీరు తొందర పడొద్దు. తిరిగి ఇంటికి వెళ్ళండి" అన్నాడు రామ్మోహన్ తొందరగా.

"ఆయన మళ్ళీ నన్ను ప్రేమించడం జరుగుతుందా? నా మనస్సు విరిగి పోయింది. పరస్పర విశ్వాసం లేకుండా కాపురం చెయ్యడం వ్యభిచారంకన్నా హీనంకాదా?"అని ప్రశ్నించింది సావిత్రి. ఆమె కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి.

రామ్మోహన్ మళ్ళీ ఆ విషయం తరచలేదు. అయినా తెల్లారిలేస్తూనే శ్రీనివాస్ దగ్గరికి వెళ్ళి మాట్లాడదామనుకున్నాడు. ఆ రాత్రి మాధవి సావిత్రి పక్కనే పడుకుంది. సావిత్రికి నిద్రలేదు. పిల్లలేం చేస్తున్నారో అనే ఆలోచనే ఆవిణ్ణి పీడించింది. మరోవైపు భర్త తనని అనుమానించి చెయ్యి చేసుకున్న దృశ్యం ముల్లులా గుచ్చుకుంటూంది.

తెల్లారక ముందే శ్రీనివాస్ రామ్మోహన్ ఇంటికి వచ్చాడు. వస్తూనే నానా దుర్భాషలూ ఆడాడు. తన పెళ్ళాం అతని ఇంటికి వస్తుందని తనకు ముందే తెలుసు నన్నాడు. రామ్మోహన్ ఏం చెప్పినా వినిపించుకోలేదు. సావిత్రి నిర్లిప్తంగా ఉండిపోయింది. మాధవి సర్ది చెప్పబోయింది.

"అన్నయ్యగారూ? అకారణంగా ఆవిణ్ణి అనుమానించడం మంచిది కాదు. ఇన్నేళ్ళ కాపురం తరువాత ఇప్పుడీ మనస్పర్థ లేమిటి; నా మాట వినండి."

"నా సంసారం సంగతేమిటో నాకు తెలీదా ఏమిటీ?" అన్నాడు శ్రీనివాస్ నిరసంగా.

"మరోసారి ఆలోచించు శ్రీనివాస్! తొందర పడొద్దు. గోటితో పోయే వాటికి గొడ్డళ్ళు వద్దు" అన్నాడు రామ్మోహన్.

"చాల్లేవయ్యా? నీతులు చెబుతున్నావు. నీ సంగతీ, నీ ఆశ్రమం సంగతీ ఎవరికి తెలియదు? అకారణంగానే నా పెళ్ళాం నీ ఇంటికి వచ్చిందా? నీకూ దానికీ ఏమిటీ

బంధుత్వం?"

రామ్మోహన్ దిమ్మెరపోయాడు. వెంటనే సావిత్రి ఏదో సమాధానం చెప్పబోయింది. కానీ ఆవిణ్ణి మాట్లాడనీయకుండా శ్రీనివాస్ ఆమె చెయ్యి పుచ్చుకొని బరబరా లాక్కుపోయాడు. రామ్మోహన్ మనసు వికలమైంది.

జరిగిన ఘర్షణలో తక్కువ గాయపడింది మాధవే. ఆ రోజంతా రామ్మోహన్‌కి సావిత్రి విషయంలో తనేం చెయ్యాలో ఎంత ఆలోచించినా తోచలేదు. అతనేం చేస్తాడో వేచి చూద్దామని మాధవి అంది.

శ్రీనివాస్ భార్యని ఇంటికి తీసికెళ్ళలేదు. సరాసరి ఆమె పుట్టింటికి తీసికెళ్ళి విడిచిపెట్టాడు. పిల్లల్ని తన వద్దనే అట్టిపెట్టుకున్నాడు. రమణమూర్తి ఎంత ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. సావిత్రి కొడుకులకి దూరమైనందుకు విచారించిందేగాని, భర్తతో తెగతెంపులైనందుకు విచారించలేదు.

ఆ సంఘటన తరువాత రామ్మోహన్ సావిత్రి బాగోగులు తెలుసుకుంటూ వచ్చాడు. శ్రీనివాస్‌ని మళ్ళీ కలవలేదు. అతను వేరే ఎవరినో చేరదీశాడనీ, నెల తిరక్కుముందే ఆవిణ్ణీ వదిలేశాడనీ విన్నాడు. అతను సుఖపడగలడని రామ్మోహన్ భావించలేదు. శ్రీనివాస్ ప్రపంచాన్ని నమ్మడు. ప్రపంచమూ అతన్ని నమ్మదు.

• *ఆంధ్రప్రభ వారపత్రిక, 17 జూన్ 1987* •

రచన : 17.10.86